క్లుప్తంగా

పేదల ఇళ్లు కూల్చిన వారికి ఓటు అడిగే హక్కు లేదు



భిక్కనూరు: పేదల ఇళ్లు కూల్చిన వారికి ఓటు అడిగే హక్కు లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొత్త నర్సింలు అన్నారు. శుక్రవారం ఆయన భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో మాట్లాడారు. జంగంపల్లిలో పట్టాలు ఉన్న నిరుపేదలు ఇళ్లు కట్టుకుంటే అక్రమ కట్టడాలంటూ బీఆర్ఎస్ నేతలు, ప్రజా ప్రతినిధులు ఇళ్లు కూల్చి వేయించారన్నారు. వారు ఓట్లు అడిగేందుకు వస్తే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం నేతలు కడారి భూమయ్య, రమేష్, దేవరాజ్, అర్జున్, ప్రవీణ్, సావిత్రి, శ్యామల తదితరులున్నారు.

కుట్టు మిషన్ అందజేత



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని హరిజనవాడకు చెందిన నగేష్ నివాసపు ఇల్లు కొన్ని రోజుల క్రితం దగ్ధమైంది. ఈ ఘటనలో ఇళ్లు, సామగ్రి, నిత్యావసర సరకులు పూర్తిగా కాలిపోయాయి. లయన్స్ క్లబ్ సభ్యులు నగేష్ కుటుంబాన్ని పరామర్శించి కొంత నగదు, నిత్యావసర సరకులను అందజేశారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు నగేష్ కుటుంబానికి ఉపాధినిచ్చే కుట్టుమిషన్‌ను అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, కోశాధికారి కాశిరెడ్డి, సభ్యులు నారాయణరెడ్డి, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, బెజుగం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు సీసీ కెమెరాలు

మద్నూర్(జుక్కల్): అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా, ఫిర్యాదు అందిన 100 నిమిషాలలోపే ఆ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ తిరిగే వాహనాలకు 360 డిగ్రీల కోణంలో తిరిగే సీసీ కెమెరాలను అమర్చారు. ఈ కెమెరా ఫుటేజీని జిల్లా, డివిజనల్ రిటర్నింగ్ అధికారులు తమ కార్యాలయాల్లోనే ఉండి పర్యవేక్షించేలా అనుసంధానం చేశారు.

వ్యాయామంతోనే శరీరానికి మేలు



పెద్దకొడప్‌గల్/పిట్లం(జుక్కల్): ప్రతి రోజు దివ్యాంగ పిల్లలకు ఇంటి దగ్గర వ్యాయామం చేయించడం వల్లనే శరీరానికి మేలు కలుగుతుందని, పిల్లల తల్లిదండ్రులకు ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి సూచించారు. శుక్రవారం పెద్దకొడప్‌గల్, పిట్లం మండల కేంద్రాల్లోని ఎంఆర్‌సీ కార్యాలయాల్లో ఎంఈవో దేవి సింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్‌లు నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులకు వ్యాయమాల గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్, రాందాస్, రాథోడ్ బలరాం, కంప్యూటర్ ఆపరేటర్ పవిత్ర, ఉపాధ్యాయులు కమల్ కిషోర్, గంగాధర్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని పిట్లం – బాన్సువాడ ప్రధాన రహదారులలో శుక్రవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై లింబాద్రి మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా సేవ కోసం ఉద్యోగాన్నే వదిలేశా

- నేను లోకల్.. ఇతరులు నాన్ లోకల్
- జుక్కల్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే



ఎమ్మెల్యే సింధే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మేనూర్ గ్రామస్తులు

మద్నూర్(జుక్కల్): నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడం కోసమే ప్రభుత్వ ఉద్యోగాన్ని సైతం వదిలివేసి వచ్చానని జుక్కల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే పేర్కొన్నారు. పెద్ద ఎక్లార, తడిహిప్పర్గ, ఖరగ్, సుల్తాన్‌పేట్, మేనూర్ గ్రామాలలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి జరగాలంటే ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇక్కడ అభ్యర్థులు దొరకనట్లు కాంగ్రెస్ వాళ్లు సంగారెడ్డి నుంచి, బీజేపీ వాళ్లు నిజామాబాద్ నుంచి అభ్యర్థులను తీసుకువచ్చి నిలబెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను ఈ ప్రాంత బిడ్డనని, ఇక్కడే పుట్టానని ఇక్కడే చస్తానని లోకల్ వ్యక్తినని అన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దళితులందరికి దళిత బంధు అందిస్తామన్నారు. ఇతర పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్‌కు ఓటు వేయాలన్నారు. మేనూర్, పెద్ద ఎక్లారలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. నాయకులు రాంపటేల్, శీనుపటేల్, సురేష్, బస్సీపటేల్ తదితరులు

బీఆర్ఎస్‌కు ప్రజల మద్దతు

- జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు



సింగితంలో మాట్లాడుతున్న దఫేదార్ రాజు

నిజాంసాగర్(జుక్కల్): సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. శుక్రవారం మహమ్మద్‌నగర్ మండలంలోని తెల్గాపూర్, సింగితం, శనివార్‌పేట గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధేకు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సింగితం గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు, యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ నాయకులు గంగారెడ్డి, వాజిద్ అలీ, ర్యాల లావణ్య, కలకొండ శైలజ, శంకర్‌రెడ్డి, కిష్టారెడ్డి, విఠల్, వెంకటేశం, తదితరులు ఉన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి



లింగంపల్లిలో వడ్డేపల్లిని సన్మానిస్తున్న గ్రామస్తులు



సబ్దల్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న వడ్డేపల్లి విద్యారాణి

- ఎల్లారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): తెలంగాణ అభివృద్ధి జరగాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే సాధ్యమని ఎల్లారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం లింగంపల్లి, జనగాం, భూంపల్లి, తుక్కోజీవాడి, తిమ్మోజీవాడి, వజ్జపల్లి, వజ్జపల్లి తండా, ఉత్తునూర్, లక్ష్మీనాయక్ తండా, యాచారం, పూర్యానాయక్ తండా, సజ్యానాయక్ తండాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వండని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. గత 20 ఏళ్లుగా ప్రజల మధ్యలో ఉంటూ సమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్నానన్నారు. తనకు టికెట్ విషయంతో కాంగ్రెస్ పార్టీలో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాణాల లక్ష్మారెడ్డి, సుభాష్, బాపురెడ్డి, సంతోష్ పాటిల్, జైపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, కొప్పుల గంగారెడ్డి, జనగామ ప్రభాకర్ రెడ్డి, భూంరావు, భాస్కర్, రమేశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): బీజేపీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి సతీమణి విద్యారాణి అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి మండలంలోని సబ్దల్‌పూర్, మల్లయ్యపల్లి గ్రామాలలో ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

గ్యారంటీ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి

- జుక్కల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావు



లక్ష్మీకాంతరావుపై పూలవర్షం కురిపిస్తున్న ప్రజలు

నిజాంసాగర్(జుక్కల్): సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ స్కీములతో ఎన్నికల మేనిఫెస్టోను ప్రవేశపెట్టిందని జుక్కల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావు అన్నారు. ఎన్నికల మేనిఫెస్టో, గ్యారంటీ పథకాలే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తాయన్నారు. శుక్రవారం మంగ్లూర్, నర్సింగ్‌రావ్‌పల్లి, వెల్గనూర్, అచ్చంపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామాల్లో ఘనస్వాగతం పలికారు. లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ..తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా సమస్యలు పట్టించుకునే నాథుడు కరువయ్యాడని ఆరోపించారు. దళితబంధు పథకం ధనికులకు దోహదపడిందన్నారు. అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ, మహాలక్ష్మి కింద రూ.2,500, చేయూత కింద రూ.4 వేలు, యువ వికాసం కింద రూ.5 లక్షలు, రైతు భరోసా కింద రూ.15 వేలు, గృహ జ్యోతి కింద ఇంటికి 200 వందల యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, నాయకులు జయప్రదీప్, పండరి, లక్ష్మారెడ్డి, కిష్టారెడ్డి, తదితరులున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రభు పాటిల్



నిజాంసాగర్(జుక్కల్): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో, పార్టీ పథకాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కర్ణాటక రాష్ట్ర గుల్బర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అల్లం ప్రభు పాటిల్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుల్తాన్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను తప్పనిసరిగా అమలు చేస్తుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు జయప్రదీప్, ప్రజాపండరి, ఏలె మల్లికార్జున్, ఆకాష్ తదితరులున్నారు.

స్థానికేతరులకు ఓటెలా వేస్తారు

- మదన్‌మోహన్ స్థానికుడు కాదు
- అందుబాటులో ఉండే వ్యక్తికి ఓటు వేయాలి
- ఎమ్మెల్యే జాజాల సురేందర్



కన్నాపూర్‌లో సురేందర్‌ను బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

రామారెడ్డి: కరీంనగర్ నుంచి వచ్చి ఎల్లారెడ్డిలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు స్థానికతను ఎమ్మెల్యే సురేందర్ ప్రధానంగా ప్రస్తావించారు. శుక్రవారం కన్నాపూర్ తండా, కన్నాపూర్, గొల్లపల్లి, రంగంపేట, మోషంపూర్, ఉప్పల్‌వాయి, గిద్ద, పోసానిపేట, గోకుల్‌తండా గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు స్థానికతపై అన్ని గ్రామాలలో ప్రధానంగా ప్రస్తావించారు. కడప, కర్నూల్ నుంచి స్థానికేతరులు గ్రామాలకు వచ్చి ప్రచారం నిర్వహించి, నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలను అవమానిస్తున్నారని ఆరోపించారు. తాను ఎల్లవేళలా ప్రతి కార్యకర్తకు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించానని కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటు వేయాలన్నారు. సీఎంగా కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తుండడంతో కామారెడ్డి నియోజకవర్గంతో పాటు ఎల్లారెడ్డి సమానంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రచారం నిర్వహించిన గ్రామాలలో మహిళలు బోనాలతో సురేందర్‌కు స్వాగతం పలికారు. ఎంపీపీ దశరథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ సదాశివరెడ్డి పాల్గొన్నారు.

మాచాపూర్, వెల్లుట్ల గ్రామాల్లో ప్రచారం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని మాచాపూర్, వెల్లుట్ల, మీసానిపల్లి గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సురేందర్‌ను గెలిపించాలని అన్నారు. ప్రచారంలో భాగంగా ఉపాధి హామీ కూలీలతో కలిసి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ మట్టి తట్టలను మోశారు. బీఆర్ఎస్ నాయకులు జలంధర్‌రెడ్డి, సతీష్, సురేందర్ తదితరులున్నారు.

అధికారంలోకి రాగానే రూ.2 లక్షలు మాఫీ



మదన్‌మోహన్‌ను ఎత్తుకున్న గిరిజనులు



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మదన్‌మోహన్‌రావు

- ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్ అన్నారు. శుక్రవారం జాన్కంపల్లి ఖుర్దు, కొట్టాల్, లక్ష్మాపూర్, అడివిలింగాల, కొక్కొండ, పోసానిపల్లి, గండిమాసానిపేట, తిమ్మాపూర్, సోమర్యాగడితాండా, శివాపూర్ తదితర గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడివిలింగాల గ్రామంలో మదన్‌మోహన్‌కు మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. అనంతరం మదన్‌మోహన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అసైన్డ్ భూములకు పరిష్కారం చూపుతానని, పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తానని అన్నారు. భూమి లేని కౌలు రైతులకు రైతు బంధు తరహాలో సహాయం చేస్తామన్నారు. వరి పండించే రైతులకు అదనంగా రూ.500 చెల్లిస్తామన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ వేస్తామని తెలిపారు. ప్రజలను మోసం చేసిన ఎమ్మెల్యే సురేందర్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎల్లారెడ్డి అభివృద్ధికి ప్రత్యేకంగా మేనిఫెస్టోను రూపొందించినట్లు తెలిపారు. నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఆరీఫ్, గయాజుద్దిన్, విద్యాసాగర్, సాయిబాబా, శ్రీనివాస్‌రెడ్డి, సామెల్, వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు.

గిరిజనుల చూపు కాంగ్రెస్ వైపు:చౌహాన్

గిరిజనులు చూపు కాంగ్రెస్ వైపు ఉన్నదని జాతీయ కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకులు రమేష్ చౌహాన్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మదన్‌మోహన్‌తో కలిసి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మకూర్ గ్రామ ఉపసర్పంచ్ ఆనంద్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు, యువకులు బీజేపీ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. గ్రామ ఉపసర్పంచ్‌తో పాటు గ్రామానికి చెందిన మరో 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఎల్లారెడ్డిలోని కాంగ్రెస్ కార్యాలయంలో వీరందరికి మదన్‌మోహన్‌రావు, పార్టీ కండువాలను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ధర్మారెడ్డి గ్రామ సర్పంచ్ శ్రీధర్‌గౌడ్ ఉన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ చౌరస్తాకు చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన వంద మంది శుక్రవారం ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నర్సింగరావు మాట్లాడుతూ.. కేసీఆర్ గెలిస్తే సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ తరహాలో అభివృద్ధి చెందుతుందన్నారు.

ఓటరు అవగాహనపై పోటీలు

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ప్రిన్సిపల్ గంగాధర్ తెలిపారు. కేంద్రం ప్రభుత్వంలోని కమ్యూనికేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ ఆధ్వర్యంలో స్వేచ్ఛాయుత ఓటింగ్‌కు ఎదురవుతున్న ఆటంకాలు, పరిష్కారాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. అలాగే నాయకుడి ఎంపికలో ఓటరు పాత్ర అంశంపై ఉపన్యాసం, ఎన్నికలు, దేశభక్తిపై పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి ఈనెల 20న బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమాన్ని రాజనీతి శాస్త్రం అధ్యాపకులు విఠల్ పర్యవేక్షిస్తారన్నారు.

ప్రజలు బాగుండాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలి



దేవునిపల్లిలో ప్రచారం చేస్తున్న నిట్టు జాహ్నవి



పెద్దమల్లారెడ్డిలో ప్రచారం చేస్తున్న గంప శశాంక్

- చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి

కామారెడ్డి టౌన్/కామారెడ్డి రూరల్: అన్ని వర్గాల ప్రజలు బాగుండాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 14, 35వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పథకాలను, ఎన్నికల మేనిఫెస్టోను ఓటర్లకు వివరించారు. కౌన్సిలర్లు గోదావరి, కృష్ణాజీరావు, నాయకులు లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

పెద్దమల్లారెడ్డిలో శశాంక్ ప్రచారం

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డిలో సీఎం కేసీఆర్ తరఫున బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు గంప శశాంక్ శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శశాంక్ మాట్లాడుతూ.. కేసీఆర్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు రంజిత్‌వర్మ, సింగిల్ విండో చైర్మన్ రాజాగౌడ్, నేతలు సతీష్‌రెడ్డి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భిక్కాజి బల్వంతరావ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తేవాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బూత్ కమిటీ ఇన్‌చార్జి సభ్యులు ఆముద నాగరాజు, చింతల స్వామి, నల్లవెల్లి అశోక్, సాయిబాబా, దుబ్బని శ్రీకాంత్ పాల్గొన్నారు.

మాచారెడ్డి: సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ శుక్రవారం గజ్యానాయక్ తండా, అక్కాపూర్, ఘన్‌పూర్, చుక్కాపూర్, సోమారంపేట గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రచారం నిర్వహించారు.

‘అభివృద్ధిలో భాగస్వాములు కావాలి’



సుభాష్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

బీబీపేట: తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలమణి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆపన్న హస్తం

బీబీపేట: మాందాపూర్ గ్రామానికి చెందిన మొగుల్ల మహేష్ అనే వ్యక్తి ఇటీవల ప్రమాదంలో గాయపడటంతో ఆయనకు వైద్య చికిత్స నిమిత్తం శుక్రవారం సుభాష్‌రెడ్డి సౌజన్యంతో ఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు రూ.5 వేలను ఆర్థిక సహాయంగా అందించారు. దోమకొండకు చెందిన అబ్దుల్ రహ్మాన్‌కు ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో ఆయనకు కూడా ఆర్థిక సహాయం అందించారు. మరొకరికి బియ్యం అందజేశారు. ఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు రవీందర్‌రెడ్డి, మట్ట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు రామేశ్వర్‌పల్లిలో పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈ కవాతును నిర్వహించినట్లు డీఎస్పీ ప్రకాష్ చెప్పారు. ఈ కవాతులో సీఐ తిరుపయ్య, ఎస్సై సాయికుమార్, 52 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారం..

నేడు సర్వ సభ్య సమావేశం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాము తెలిపారు. ఎంపీపీ పాల్త్య విఠల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమావేశానికి డివిజన్‌స్థాయి అధికారులు హాజరవ్వాలన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 30 వరకు గడువు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఓపెన్ టెన్త్, ఇంటర్‌లలో ప్రత్యేక ప్రవేశాల షెడ్యూల్ ప్రారంభమైందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దకొడప్‌గల్ స్టడీ సెంటర్ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ సీజీ కిషన్ తెలిపారు. ఏవైనా సమస్యలతో మధ్యలో బడి మానేసిన వారు 14 ఏళ్లు ఉంటే పది పరీక్షలకు, పది పాసై రెగ్యులర్‌గా ఇంటర్ చేయని వారు ఓపెన్ ఇంటర్‌లలో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. కేవలం నాలుగు నెలల్లోనే ఓపెన్‌లో పది, ఇంటర్ పూర్తి చేయవచ్చని ఈ అవకాశం ఈ నెల 30 వరకు ఉందని, సద్వినియోగం చేసుకుని పైచదువులకు, ఉద్యోగులు పదోన్నతుల కోసం అర్హత సాధించవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 9866343898 సంప్రదించాలని కోరారు.

ఎల్లారెడ్డిలో బీఎస్పీ బహిరంగ సభ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో నేడు బీఎస్పీ బహిరంగ సభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీఎస్పీ అభ్యర్థి జమునా రాథోడ్ తెలిపారు. శుక్రవారం బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. శనివారం సభకు పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వస్తున్నట్లు తెలిపారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలి



ఆత్మకూర్‌లో పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రఘు



మైలారంలో.. ఎంపీడీవో రాము

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో ఓటరు స్లిప్‌ల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. ఆత్మకూర్‌లో శుక్రవారం ఓటర్ స్లిప్‌ల పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరుగా ఓటర్లకే స్లిప్పులను పంపిణీ చేయాలన్నారు. వలస వెళ్లినవారి ఓటర్‌స్లిప్పులు ఇతరులకు ఇవ్వకూడదని చెప్పారు. గ్రామంలో ఇటీవల ఎవరైనా చనిపోయినవారుంటే వారి ఓటర్ స్లిప్పులను తహసీల్ కార్యాలయంలో అధికారులకు అప్పగించాలని చెప్పారు. స్లిప్పులు ఇచ్చిన వెంటనే ఓటర్లతో సంతకాలు చేయించాలన్నారు. కార్యదర్శి రమేష్ ఉన్నారు.

ఓటరు స్లిప్పు పంపిణీ ప్రారంభం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల వ్యాప్తంగా శుక్రవారం ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించినట్లు ఎంపీడీవో రాము తెలిపారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్ నెం.137, 138, 143, 144లను ఆయన పరిశీలించారు.

సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు



కామారెడ్డి రూరల్: పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతి మాత ఆలయంలో కార్తీక మాస మొదటి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతంతో అభిషేకం చేసి అమ్మవారిని అలంకరించారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలాల సిద్దాగౌడ్, రోండ్ల నారాయణరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

దేవునిపల్లిలో కార్తీక దీపోత్సవం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి వీర వెంకట రమా సత్యనారాయణస్వామి, కృష్ణమందిర్, భవానీ శంకర ఆంజనేయస్వామి ఆలయాల్లో శుక్రవారం సాయంత్రం కార్తీక ఆకాశ దీపోత్సవం నిర్వహించారు. ప్రతిరోజు విశేష పూజా కార్యక్రమాలతో పాటు ఆకాశ దీపోత్సవం నిర్వహిస్తున్నామని, భక్తులు హాజరై జయప్రదం చేయాలని అర్చకులు బి.శ్రీనివాస్‌రావు కోరారు.